


# నవతరం

తెలుగు దినపత్రిక

ప్రచురణ కేంద్రం: హైదరాబాద్ , రాజమండ్రి | సంపుటి : 12 | సంచిక : 309 | సోమవారం 16 -3-2026 | పేజీలు : 4 | వెల : 5-00

## ఏప్రిల్ 23న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు..




- రాష్ట్రంలోని మొత్తం 234 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఒకే విడతలో పోలింగ్
- రాష్ట్రంలో మొత్తం 5.67 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.
- ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఓటు వేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు
- సమాయత్తమవుతున్న పార్టీలు




## కాన్షీరామ్‌కు 'భారతరత్న' ఇవ్వండి...

- కాన్షీరామ్‌కు భారతరత్న ప్రకటించడం ఆయన దేశానికి చేసిన సేవలకు దక్కే నిజమైన గౌరవం
- ప్రతి భారతీయుడికి రాజ్యాంగం సమానత్వం, గౌరవం, భాగస్వామ్యం కల్పించిందీ
- ప్రధాని మోదీకి రాహుల్ గాంధీ లేఖ



# నేటి నుంచి టెన్త్ పరీక్షలు

- ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు
- పరీక్షలు రాసే విద్యార్థులు 6,40,916 మంది
- రాష్ట్రవ్యాప్తంగా 3,415 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు
- డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్ ఉన్నా అనుమతి
- హాల్‌టికెట్ చూపిస్తే ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం
- 8.45 గంటలకు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి
- తప్పనిసరి పరిస్థితుల్లో 10 గంటల వరకు అనుమతి

అమరావతి, **నవతరం**

పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభం కానున్నాయి. ఈ నెల 16 నుంచి ఏప్రిల్ 1 వరకు జరగనున్నాయి. ప్రతిరోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష జరుగుతుంది. ఈ ఏడాది మొత్తం 6,40,916 మంది పరీక్షలు రాయనుండగా.. వారిలో రెగ్యులర్ విద్యార్థులు 6,22,074 మంది, ప్రైవేటు విద్యార్థులు 18,842 మంది ఉన్నారు. బాలురు 3,28,652, బాలికలు 3,12,264. రాష్ట్రవ్యాప్తంగా 3,415 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. 38,958 మంది ఇన్విజిలేటర్లు పరీక్షల విధుల్లో పాల్గొంటారు. సమస్యాత్మకంగా గుర్తించిన 210 కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అలాగే 156 ఫ్లైయింగ్ స్క్వాడ్‌లను నియమించారు. పరీక్షలు రాసే విద్యార్థులు హాల్ టికెట్ చూపించి ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవచ్చు. ఉదయం 8.45 గంటల్లోపే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని పాఠశాల విద్యాశాఖ సూచిస్తోంది. తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే 10 గంటల వరకు విద్యార్థులను అనుమతిస్తారు. 10 తర్వాత ఎవరినీ పరీక్ష హాలులోకి అనుమతించరు.

### ప్రభుత్వ పరీక్షల విభాగం సూచనలు

విద్యార్థులు ఒరిజినల్ హాల్ టికెట్‌ను తీసుకెళ్లాలి. ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకున్నదైనా అనుమతిస్తారు.

బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్నులు రెండు తెచ్చుకోవాలి. పెన్సిల్, ఎరేజర్, షార్ప్‌నర్, స్కేలు తీసుకెళ్లాలి.

పారదర్శకంగా ఉండే వాటర్ బాటిల్ తీసుకెళ్లడం మంచిది.

మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచీలు, కాలిక్యులేటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలు అనుమతించరు.

పుస్తకాలు, కాగితపు ముక్కలు, నోట్ పుస్తకాలు తీసుకెళ్లకూడదు.

### ఒత్తిడిని జయించండి

విద్యార్థులు ఒత్తిడిని జయించి ప్రశాంతంగా పరీక్షలు రాయాలని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కేవీ శ్రీనివాసులురెడ్డి సూచించారు. పరీక్షలు అనేవి జీవితంలో ఒక భా గం మాత్రమేనని గుర్తుంచుకోవాలన్నారు. 'నేను రాయగలను. చదవగలను. సాధించగలను' అనే ధీమాతో పరీక్షలు రాయాలని సూచించారు. క్లిష్టంగా ఉండే సబ్జెక్టులకు ఎక్కు వ సమయం కేటాయిస్తూ సమయపాలన పాటించాలన్నారు.

## దుష్ప్రచారాలు నమ్మవద్దు..

**ఎంపీ పుట్టా మహేష్ కుమార్**



హైదరాబాద్/ఏలూరు,**నవతరం**

హైదరాబాద్ మొయినాబాద్ లో నిన్న జరిగిన జరిగిన డిన్నర్ పార్టీ సంఘటనలో తనపై వచ్చిన కథనాలను ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఖండించారు. ఆదివారం పోలీసు విచారణ ముగించుకుని హైదరాబాద్ లోని తన నివాసానికి చేరుకున్న ఎంపీ మీడియాకు వీడియో ద్వారా ఒక ప్రకటన విడుదల చేశారు. తాను ఎలాంటి వ్యక్తినో రెండేళ్లుగా ఏలూరు ప్రజలు, పార్టీ నేతలు, కార్యకర్తలు అందరికీ తెలుసునన్నారు. తనకు ఎటువంటి దురలవాట్లు లేవని, ఏ తప్పు చేయలేదని, కేవలం ఒక స్నేహితుడు పిలిస్తే కలవడానికి మాత్రమే మొయినాబాద్ వెళ్ళానని, కలిసి వచ్చే సమయంలో జరిగిన కొన్ని సంఘటనలపై మీడియాలో రకరకాల కథనాలు వచ్చాయని, వాటిని ఎవ్వరూ నమ్మవద్దని, పోలీసు విచారణకు సహకరిస్తానని, పూర్తి వివరాలతో త్వరలో ప్రజల ముందుకు వస్తానని ఎంపీ తన ప్రకటనలో తెలిపారు. నిజం గెలుస్తుందని, ఎటువంటి ఆందోళన చెందవద్దని ప్రజలకు, అభిమానులకు ఎంపీ తన ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## పోలవరానికి కేంద్రం రూ.1,508 కోట్లు..

ఖర్చుకు నేడే డెడ్‌లైన్!




# చంద్రబాబుపై రాళ్ల దాడి కేసు

**నలుగురి బెయిల్ రద్దు, వైసీపీ ఎమ్మెల్సీకి ముందస్తు బెయిల్**






అమరావతి,**నవతరం**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో ఆయన కాన్వాయ్‌పై జరిగిన రాళ్ల దాడి కేసులో హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ కేసులోని మొదటి నలుగురు నిందితులకు గతంలో నందిగామ కోర్టు మంజూరు చేసిన బెయిల్‌ను ఉన్నత న్యాయస్థానం రద్దు చేసింది. తీర్పు కాపీ అందిన వారం రోజుల్లోగా సంబంధిత మేజిస్ట్రేట్ ముందు లొంగిపోవాలని నిందితులను ఆదేశించింది.



## పండుగ పూట ముస్లిం సోదరుల నోటి వద్ద ముద్ద లాగిన వ్యక్తి జగన్

- తాను మంత్రిగా ఉన్న సమయంలోనే రంజాన్ తోఫా ఇచ్చాం
- రంజాన్ తోఫా పంపిణీ, ఇఫ్తార్ విందు సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత
- పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్ట్ తరపున రంజాన్ తోఫా పంపిణీ

## డ్రగ్స్ టెస్టుకు నేను సిద్ధం...

**- కాంగ్రెస్ సవాల్ స్వీకరించిన కేటీఆర్**



హైదరాబాదు,**నవతరం**

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తాను డ్రగ్స్ టెస్టుకు సిద్ధంగా ఉన్నానని ఆదివారం ప్రకటించారు. మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లో జరిగిన డ్రగ్స్ పార్టీ వ్యవహారంలో కాంగ్రెస్ నేతలు విసిరిన సవాల్‌ను ఆయన స్వీకరించారు. డ్రగ్స్ వాడేవారు ఎవరైనా, ఏ పార్టీకి చెందినవారైనా చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని స్పష్టం చేశారు. "ఏ టెస్టుకైనా నేను సిద్ధమని ఇప్పటికే చాలాసార్లు చెప్పాను. అన్ని రాజకీయ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు ఈ పరీక్ష చేయించుకోవాలన్న మహేశ్ కుమార్ గౌడ్ సూచనను స్వాగతిస్తున్నాను. మనమే ఉదాహరణగా నిలుద్దాం" అని కేటీఆర్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు,

మిగతా 2లో

# తెలంగాణలో గ్యాస్ కొరత లేదు

(మొదటి పేజి (తరువాయి)

నెలకు యావరేజ్ 60 లక్షల సిలిండర్లు డొమెస్టిక్ వాడుతున్నారు. కమర్షియల్ సిలిండర్ విషయంలోనే కొరత ఏర్పడుతోంది. డొమస్టిక్ కన్జుమర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం ఎలాంటి కొరత లేదు. ఆందోళనతో ముందస్తుగా అవసరం లేకున్నా గ్యాస్ బుక్ చేసుకుంటున్నారు. గృహ అవసర సిలిండర్లకు కొరత లేదు. కమర్షియల్ సిలిండర్లను కేంద్రం 20 శాతం సప్లై చేస్తోందన్నారు. కమర్షియల్ సిలిండర్ల విషయంలో కేంద్రానికి లేఖ రాశాం. ప్రతి రోజు 2.15 లక్షల ఎల్పీజీ డొమాస్టిక్ సిలిండర్లు సప్లై చేస్తారు. నిన్న మొన్న 2.3 లక్షలు సప్లై చేశారు. కమర్షియల్ సిలిండర్లు రోజుకు 23 వేలు సప్లై చేసే వాళ్లు. కానీ ప్రస్తుతం 6200 సిలిండర్లు మాత్రమే ఇస్తున్నారు. స్కూల్స్, కాలేజెస్, సెంటర్, స్టేట్ గవర్నమెంట్ సంస్థలకు కమర్షియల్ సిలిండర్లు విషయంలో ప్రాధాన్యత ఇస్తున్నాం. సివిల్ సప్లై భవన్ లో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని. ఎవరైన కృత్రిమంగా గ్యాస్ కొరత సృష్టించినా..బ్లాక్ మార్కెట్ చేసినా హెల్ప్ లైన్ 180042500344 కు కాల్ చేయొచ్చని' మంత్రి ఉత్తమ్ చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 1.3 కోట్ల మంది యాక్టివ్ గృహ వినియోగదారులు ఉన్నారని, వారికి సరిపడా సిలిండర్లను ఆయిల్ కంపెనీలు అందిస్తున్నాయని మంత్రి తెలిపారు. గతంలో రోజుకు సగటున 2.15 లక్షల సిలిండర్లు సరఫరా అయ్యేవని, ప్రస్తుత డిమాండ్‌ను బట్టి దానిని 2.3 లక్షలకు పెంచినట్లు ఆయన వెల్లడించారు. గ్యాస్ కొరత ఉందన్న ఆందోళనతో వినియోగదారులు అనవసరంగా ఓవర్ బుకింగ్ చేసి సిస్టమ్‌ను ఓవర్‌లోడ్ చేయవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.హోటళ్లు, ఇతర వ్యాపార సంస్థలు వాడే 19 కేజీల కమర్షియల్ సిలిండర్ల సరఫరాలో మాత్రం తగ్గుదల ఉన్న మాట వాస్తవమేనని మంత్రి అంగీకరించారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశిరచిన కొత్త మార్గదర్శకాల వల్ల గతంలో ఉన్న సరఫరాలో కేవలం 20 శాతం మాత్రమే ప్రస్తుతం అందుబాటులో ఉందని ఆయన వివరించారు. గతంలో రోజుకు 23,000 కమర్షియల్ సిలిండర్లు సరఫరా అయ్యే చోట, ఇప్పుడు కేవలం 6,200 మాత్రమే వస్తున్నాయని, ఈ సమస్యను పరిష్కరించేందుకు
కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుతామని ఆయన



హామీ ఇచ్చారు. రాష్ట్రంలో గ్యాస్ పంపిణీ సక్రమంగా జరిగేలా చూడటంతో పాటు, అక్రమ నిల్వలను అరికట్టేందుకు రాష్ట్ర , జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు.

గృహ అవసరాల సిలిండర్లు పక్కదారి పట్టకుండా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. మొత్తానికి, సామాన్యుడి వంటింట్లో మంట ఆరిపోకుండా ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుంటోందని ఆయన భరోసా ఇచ్చారు.

# అమరజీవి విగ్రహావిష్కరణకు పకడ్బందీ ఏర్పాట్లు

అమరావతి, భీమోదయం: పొట్టి శ్రీరాముల 58 రోజుల ఆమరణ దీక్షకు గుర్తుగా 58 అడుగుల అమరజీవి కాంస్య విగ్రహాన్ని అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్టు సభ్యులు ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. రాజధాని అమరావతిలోని తుళ్లూరు లో అమరజీవి పొట్టి శ్రీరాములు స్మృతి వనంలో ఏర్పాటు చేస్తున్న పొట్టి శ్రీరాముల కాంస్య విగ్రహ ఏర్పాటు పనులను మంత్రి సవిత శనివారం పరిశీలించారు. విగ్రహ ఏర్పాటు పనులు ఎంతవరకూ వచ్చాయో అడిగి తెలుసుకున్నారు. ఆదివారం మధ్యాహ్నానికే విగ్రహాన్ని సిద్ధం చేయాలని అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్టు సభ్యులకు సూచించారు. అనంతరం స్మృతివనం సమీపంలో ఏర్పాటు చేస్తున్న సభ స్థలి ఏర్పాట్లను కూడా పరిశీలించారు. పొట్టి శ్రీరాముల విగ్రహావిష్కరణకు ప్రజలు భారీ ఎత్తున తరలి రానున్నారని, ఏర్పాట్లలో అలసత్వం చూపొద్దని దిశా నిర్దేశం చేశారు. ఎవ్వరికీ ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులకు మంత్రి సవిత స్పష్టంచేశారు. సాధారణ, వీఐపీ గ్యాలరీల ఏర్పాటుతో పాటు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం తనను కలిసిన విలేకరులతో మంత్రి సవిత మాట్లాడుతూ రాజధాని అమరావతిలో 6.8 ఎకరాల్లో అమరజీవి పొట్టి శ్రీరాములు స్మృతి వనం ఏర్పాటు చేస్తున్నామన్నారు.

## నిర్భయ ఫండ్ కింద దేశవ్యాప్తంగా 10 జిల్లాల ఎంపిక

న్యూఢిల్లీ,మార్చి14(ఆర్ఎన్ఎ): గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబాల ఆర్థికాభివృద్ధికి క్రెష్ సెంటర్లు చాలా అవసరమని తెలంగాణ గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క వివరించారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నపిల్లల సంరక్షణ కోసం గ్రామాల్లో క్రెష్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం క్రెష్ సెంటర్ వర్కర్లకు రూ.5,000 మాత్రమే వేతనం ఉండటంతో సిబ్బంది కొరత ఏర్పడుతోందని.. దీంతో వేతనాలు పెంచాలని కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి అన్నపూర్ణా దేవిని కోరినట్లు మంత్రి సీతక్క తెలిపారు. ఈ ప్రతిపాదనపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం దాదాపు 1,000 క్రెష్ సెంటర్లు పనిచేస్తున్నాయని.. తక్కువ వేతనాల కారణంగా సిబ్బంది కొరత ఉందని తెలిపారు.

## భారత్‌కు మరో రెండు ఎల్పీజి నౌకలు

న్యూఢిల్లీ,మార్చి14: భారత్ మరో విజయం సాధించింది. గల్ఫ్ నుంచి రెండు ఇంధన నౌకలను అత్యంత సురక్షితంగా దేశానికి చేరుకునేలా చేసింది. హర్మూజ్ జలసంధికి ఇరువైపులా వందలాది నౌకలు చిక్కుకుపోగా.. ఈ మార్గంలో భారత నౌకలు వెళ్లేందుకు అనుమతిస్తామని ఇరాన్ పేర్కొన్న విషయం తెలిసిందే. ఈక్రమంలో రెండు భారత జెండాలు ఉన్న ఎల్పీజీ నౌకలు శనివారం ఉదయం సురక్షితంగా హర్మూజ్ జలసంధిని దాటాయని భారత ప్రభుత్వం వెల్లడించింది. 'శివాలిక్', 'నందాదేవి' పేరు గల నౌకలు గుజరాత్‌లోని ముంద్రా, కాండ్లా పోర్టుల వైపు వస్తున్నాయని షిప్పింగ్ మంత్రిత్వశాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్‌కుమార్ సిన్హా వెల్లడించారు. ఈ నౌకల్లో సుమారు 92 వేల టన్నుల ఎల్పీజీ ఉందని, మార్చి 16 లేదా 17వ తేదీన ఇవి భారత్‌కు చేరుకునే అవకాశం ఉందన్నారు. గల్ఫ్‌లో ఉన్న భారతీయ నౌకలు క్షేమంగానే ఉన్నాయని, వాటిలో ఉన్న భారత సిబ్బందికి ఎలాంటి సమస్యలు లేవని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. హర్మూజ్ జలసంధిలో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని తెలిపింది. భారత నావికుల కుటుంబసభ్యులకు ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తున్నామని వెల్లడించింది. దేశంలో ఎల్పీజీ సరఫరాపై ఆందోళన వ్యక్తమవుతోన్న సమయంలో తాజా పరిణామం ఊరట కలిగించే అంశం. గృహవినియోగ సిలిండర్ల విషయంలో ఎవరూ ఆందోళన చెందవద్దని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది.

## మూసీ సుందరీకరణ పేరిట సీఎం రేవంత్‌రెడ్డి దోపిడీ

పాపం కాంగ్రెస్ పార్టీదేనని, ఇందుకు సీఎం రేవంత్‌రెడ్డి ముక్కు నేలకు రాసి ప్రజలకు క్షమాపణ చెప్పాలని అన్నారు. కాంగ్రెస్ పాపాన్ని కడగడానికి కేసీఆర్ హయాంలో తాము మూసీ సుందరీకరణ ప్రాజెక్టు చేపట్టామని తెలిపారు. ఇందుకోసం ఒక్క ఇల్లు కూడా పోకుండా ఉండేలా అంతర్జాతీయ స్థాయి ఆర్కిటెక్ట్ కంపెనీల ద్వారా పది డిజైన్లు తీసుకుని.. ఒక దానిని ఎంపిక చేసి ప్రభుత్వానికి అప్పగించామని చెప్పారు. కానీ, రేవంత్‌రెడ్డి మాత్రం వేల మంది ఇళ్లు కూలగొట్టి, వేలాది ఎకరాలను స్వాధీనం చేసుకుని మూసీ సుందరీకరణ చేస్తామంటున్నారని ధ్వజమెత్తారరు. రూ.లక్షన్నర కోట్ల దోపిడీకి తెరలేపిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నాన్ని ప్రతి దశలోనూ అడ్డుకుంటామని ప్రకటించారు. శనివారం సాయంత్రం హిమాయత్‌సాగర్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో 'పవర్ పాయింట్ వర్సెస్ పబ్లిక్ పాయింట్' పేరిట కార్యక్రమం నిర్వహించారు.

## మిడిల్ ఈస్ట్‌లో యుద్ధ ప్రభావం

హైదరాబాద్,మార్చి14 మిడిల్ ఈస్ట్‌లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు మన హైదరాబాద్ ప్రయాణికులపై కూడా తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ఇరాన్ – ఇజ్రాయిల్ యుద్ధ ప్రభావంతో 13 అంతర్జాతీయ సర్వీసులు రద్దు అయ్యాయి. హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి వెళ్లాల్సిన పలు అంతర్జాతీయ విమానాలు శనివారం రద్దు అయ్యాయి. మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకోవడంతో ప్రయాణికుల భద్రతా కారణాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎయిర్‌పోర్ట్ అధికారులు వెల్లడించారు. మిడిల్ ఈస్ట్ దేశాల్లో యుద్ధ వాతావరణం కారణంగా ఆయా దేశాల ఎయిర్ స్పేస్ తాత్కాలికంగా మూసివేశారు.

# తమిళ కవి వైరముత్తుకు జ్ఞానపీఠం

చెన్నై,మార్చి14 సాహితీ పురస్కారాల్లో అత్యున్నతమైన జ్ఞానపీఠ్ పురస్కారానికి 2025వ ఏడాదికిగాను తమిళ సినీ గేయ రచయిత వైరముత్తు పేరును ఎంపిక కమిటీ శనివారం ప్రకటించింది. ఆయనకు ముఖ్యమంత్రి స్టాలిన్, రాజ్యసభ సభ్యుడు కమల్ హాసన్ తదితరులు తమ 'ఎక్స్' వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. తేని జిల్లా మేట్టూర్‌లో 1953లో జన్మించిన వైరముత్తు కళాశాల విద్యార్థిగా ఉన్నప్పుడు రాసిన 'వైకరై మేఘంగళ్' కవితా సంకలనం అప్పట్లోనే ఓ మహిళా కళాశాలకు పాఠ్యాంశంగా మారింది. తమిళనాడు ప్రభుత్వ అధికారిక భాషా కమిషన్‌లో పని చేస్తున్నప్పుడే 1980లో దర్శక దిగ్గజం భారతీరాజా తెరకెక్కించిన 'నిళల్గళ్' చిత్రం ద్వారా సినీ గేయరచయితగా తమిళ చిత్ర పరిశ్రమకు పరిచయమయ్యారు. కవితలు, నవలలు తదితర సుమారు 40 పుస్తకాలు, సినిమాలో సుమారు 7,500 పాటలు రాశారు. ఇప్పటికే ఆయన సాహిత్య అకాడమీ, సాధన సమ్మాన్, పద్మశ్రీ, పద్మభూషణ్ వంటి ప్రతిష్టాత్మక పురస్కారాలు అందుకున్నారు. ఉత్తమ గేయ రచయితగా 7 సార్లు జాతీయ పురస్కారాలు అందుకున్న ఏకైక రచయిత ఆయన మాత్రమే. ఉత్తమ గేయ రచయితగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి 6 సార్లు పురస్కారాలు అందుకున్నారు. జ్ఞానపీఠ్ పురస్కారాన్ని ఇప్పటికే రాష్ట్రానికి చెందిన అఖిలన్ (1975), జయకాంతన్ (2002) అందుకోవడం గమనార్హం. జ్ఞానపీఠ్ అవార్డుకు



ఎంపికైన వైరముత్తుకు తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ అభినందనలు తెలిపారు. 'తన కవితా పటిమతో తమిళ భాషను శాసిస్తున్న 'కవిపేరరసు' (కవి సామ్రాట్) వైరముత్తుకు జ్ఞానపీఠ్ పురస్కారం దక్కింది. ఈ రోజే నేను వైరముత్తును కలిసి మాట్లాడాను. ఆ భేటీ ముగిసిన కొద్దిసేపటికే ఈ తీపి కబురు రావడం ఆ సంతోషాన్ని మరింత రెట్టింపు చేసింది' అని ఎక్స్‌లో పోస్టు పెట్టారు.

# రేవంత్ రెడ్డి తెలంగాణ 'చోటా యోగి'...

హైదరాబాద్ మార్చి 14శేరిలింగంపల్లి నియోజకవర్గం కొండాపూర్ డివిజన్ పరిధిలోని మార్తాండ నగర్ బడా గుండులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో



కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ రంజాన్ మాసం అత్యంత పవిత్రమైనదని, ఉపవాస దీక్ష ద్వారా పేదవారి ఆకలి బాధ ఎలా ఉంటుందో ప్రతి ఒక్కరికీ అర్థమవుతుందని అన్నారు. మనకున్న దానిలో కొంత పేదలకు దానం చేయడం ద్వారా అల్లాహ్ ఆశీస్సులు లభిస్తాయని పేర్కొన్నారు.

'ఉత్తరప్రదేశ్‌లో యోగి బుల్డోజర్ పాలనలాగే తెలంగాణలో రేవంత్ రెడ్డి పాలన సాగుతోంది. రేవంత్ రెడ్డి తెలంగాణకు 'చోటా యోగి'." -- హరీశ్ రావు మైనార్టీలకు కేసీఆర్ పెద్దపీటహరీశ్ రావు మాట్లాడుతూ దేశంలో ఇమామ్‌లు, మౌజన్‌లకు గౌరవ వేతనం అందించిన ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అని అన్నారు. బీఆర్ఎస్ ఎప్పటికీ సెక్యులర్ పార్టీగా మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి పనిచేసిందన్నారు.కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కలెక్టర్లు, ఎస్పీలు, ఎమ్మెల్యేలు, మంత్రులు అధికారికంగా ఇఫ్తార్ విందులు నిర్వహించేవారని తెలిపారు. రంజాన్ మాసంలో ముస్లింలకు అందించే రంజాన్ తోఫా పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసిందని ఆరోపించారు.

## గ్యాస్‌పై ప్రజలు ఆందోళన చెందొద్దు

అమరావతి, రాష్ట్రంలో వంట గ్యాస్ సరఫరా విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రజలకు ఇబ్బంది లేకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని, మంత్రుల బృందం (జీవోఎం) నిరంతరం పరిస్థితిని సమీక్షిస్తోందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. శనివారం విజయవాడ కానూరులోని పౌర సరఫరాల రాష్ట్ర కార్యాలయంలో మంత్రులు పయ్యావుల కేశవ్,వర్చువల్‌గా నాదెండ్ల మనోహర్ పౌర సరఫరాలు, సమాచార, పౌర సంబంధాలు, పోలీస్, విజిలెన్స్ తదితర సమన్వయ శాఖల అధికారులతో పాటు ఐవోసీఎల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ తదితర ఆయిల్ అండ్ గ్యాస్ కంపెనీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎల్‌పీజీ రోజువారీ అవసరాలు, సరఫరా స్థితిగతులతో పాటు భవిష్యత్తు కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు.

# ఆయిల్ పామ్‌కు ఉజ్వల భవిష్యత్



సిద్దిపేట,మార్చి14 రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రైతులకు పెట్టుబడి, ఎరువులు అన్నీ అందిస్తున్నామని తెలిపారు. తాను మంత్రిగా వచ్చిన సమయానికి ఆయిల్ పామ్ టన్ను రూ.12వేలు ఉండేదని, కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి టన్ను ధర రూ.20 వేలకు పైగా పెంచామని చెప్పారు. సిద్దిపేట జిల్లా నర్మెట్ట ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ సందర్శించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ.. రైతులు ధైర్యంగా ఆయిల్ పామ్ పంట వేయాలని సూచించారు. ఈ పంటకు నీటి సమస్య, మార్కెట్ సమస్య లేదన్నారు. అన్ని విధాలా రైతులకు లాభాలు ఇచ్చే పంట ఆయిల్ పామ్ అని చెప్పారు. నర్మెట్టలో త్వరలో రైతు మేళా నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ రైతులు ధైర్యంగా ఆయిల్ పామ్ సాగుచేయాలన్నారు. రైతులు క్రాప్ డైవర్షన్ వైపు మారాలని లేకపోతే రైతులకు నష్టం జరుగుతుందన్నారు . సిద్దిపేట జిల్లా నర్మేటట్టలో మార్చి 22న సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించిన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని మంత్రి పొన్నంతో కలిసి సందర్శించారు.

ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి తుమ్మల.. 'తెలంగాణకు సిద్దిపేట కేంద్రంగా ఉంటుంది అందుకే ఇక్కడ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణం మొదలు పెట్టాం. ఇక్కడ రూ. 40 కోట్లతో రిఫైరీ ఆయిల్ యూనిట్ కూడా ప్రారంభిస్తాం. రైతులు పండించిన వేస్టేజ్ గెలలతో విద్యుత్ తయారు చేస్తాం. కేంద్రం వరి ధాన్యం కొనబోమని చెబుతోంది.రబీలో కూడా అత్యధికంగా మనమే వరి పండిస్తున్నాం. రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం సానుకూలంగా ఉండటంతో ఎక్కువ సాగు చేస్తున్నారు.


## వేసవి తీవ్రత అంచనాలకు అనుగుణంగా ముందస్తు చర్యలు

అమరావతి, భీమోదయం: వేసవి తీవ్రత అంచనాలకు అనుగుణంగా ముందస్తు చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. రాష్ట్రంలో క్రమంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు ఆధారంగా రూపొందించిన సమ్మర్ యాక్షన్ ప్లాన్–2026 పై ఉన్నతాధికారులతో మంత్రి సత్యకుమార్ చర్చించారు. వేసవి సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలను అప్రమత్తం చేయడం, వడ దెబ్బకు గురైతే సదరు లక్షణాలను వెన్వెంటనే గుర్తించి సకాలంలో వైద్యులను సంప్రదించేలా అవగాహన కల్పించడం, ఆహారభద్రత విభాగం డైరెక్టర్ నీలకంఠ రెడ్డి, ఇతర అధికారులతో మంత్రి చర్చించారు.

# ఆకృతి అకృత్యాలకు అడ్డుకట్ట పడేనా...?

- అన్యాక్రాంతానికి గురవుతున్న శిఖం భూములు
- కబ్జా కోరల్లో రేల కుంట శిఖం భూములు
- అనుమతులు ఒకచోట, నిర్మాణాలు మరోచోట
- జి ప్లస్ ఐదు అంతస్తుల నిర్మాణాలతో రెచ్చిపోతున్న బిల్డర్లు
- సర్వేనెంబర్ 71, 44 లలో నిర్మాణాలపై చర్యలకు వినతి






బొల్లారం / సంగారెడ్డి, నవతరం: బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో శిఖం భూములను మాయం చేస్తూ రియల్ ఎస్టేట్ ముసుగులో పెద్ద ఎత్తున బిల్డర్లు బహుళ జాతి నిర్మాణాలు చేపడుతూ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారని జిల్లా ఐఎన్టీయూసీ ఉపాధ్యక్షుడు, ఆత్మ కమిటీ డైరెక్టర్ పి.లక్ష్మారెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో రేలకుంట చెరువు శిఖం భూములను కబ్జా చేస్తూ నిర్మిస్తున్న బహుళ జాతి నిర్మాణాలను చేపడుతున్న బిల్డర్లపై చర్యలు తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ కు ఫిర్యాదు చేశారు. బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని సర్వే సంఖ్య 71లోనీ రేల కుంట శిఖం భూములు నానాటికి అన్యాక్రాంతానికి గురవుతున్నాయని వాపోయారు. కబ్జాకు గురైన శిఖం భూములలో బిల్డర్లు జి ప్లస్ ఫైవ్ స్థాయిలో భారీ భవనాలను నిర్మిస్తున్నారని అన్నారు. అదేవిధంగా ప్రభుత్వ హుడా భూమి సర్వే సంఖ్య 44లోనీ హుడా స్థలాల్లో 600 గజాలు, 795 గజాలు చొప్పున జీవో సంఖ్య 59 కింద క్రమబద్ధీకరణ చేశారు. ఈ వ్యవహారంలో కొంత భాగం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని మల్లంపేట సర్వేనెంబర్ 209లో హూడా అనుమతులు పొంది, వాటి ముసుగులో బొల్లారం మున్సిపాలిటీ పరిధికి సంబంధించి జి ప్లస్ ఫైవ్ బహుళ జాతి నిర్మాణాలను చేపడుతూ మున్సిపాలిటీ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. నిర్మాణాలకు సంబంధించి హెచ్ఎండిఏ నామ్స్ ప్రకారం నిర్మాణాలను చేపట్టకుండా ఇష్టానుసారంగా నిర్మిస్తూ అమాయకులకు విక్రయిస్తున్నారని తెలిపారు. ఈ వ్యవహారంపై రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ శాఖల అధికారులు సమగ్ర విచారణ జరిపి ప్రభుత్వ శిఖం భూములను కాపాడాలని, 59 జివొ ముసుగులో బిల్డర్లు వ్యాపారం చేస్తున్నారని 59 జీవో నిరుపేదల కోసం గత ప్రభుత్వం ప్రవేశపెట్టిందని నిజమైన నిరుపేదలకు 59 జిఓ కింద ప్రభుత్వానికి డిడి ల రూపంలో ప్రభుత్వానికి చాలామంది చెల్లించారని నిజమైన పేదవాళ్లకు రిజిస్ట్రేషన్లు అవ్వలేదని గరీబోళ్ల 59 జీవో శ్రీమంతులకు ఓ వరంలా మారిందని ప్రభుత్వం 59 జీవో దర్యాప్తు చేయాలని బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను విజ్ఞప్తి చేశారు.

# బైండోవర్ నిబంధనల ఉల్లంఘన

**రౌడీషీటర్‌కు నెల రోజుల జైలు శిక్ష**




హైదరాబాద్, నవతరం: శాంతిభద్రత లకు విఘాతం కలిగిస్తూ, నేర ప్రవృత్తిని వీడని అసాంఘిక శక్తులపై హైదరాబాద్ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. పాతబస్తీలోని ఫలక్‌నుమా డివిజన్ పరిధిలో బైండోవర్ నిబంధనలను ఉల్లం ఘించిన ఒక రౌడీషీటర్‌కు న్యాయ స్థానం నెల రోజుల జైలు శిక్ష విధించినట్లు రాజేంద్రనగర్ జోన్ డీసీపీ ఎస్. శ్రీనివాస్, ఐపీఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. కామాటిపుర పోలీస్ స్టేషన్ పరిధిలో 'మహ్మద్ రియాజుద్దీన్ అలియాస్ రియాజ్' అనే వ్యక్తిపై రౌడీషీట్ నమోదై ఉంది. గతంలో అతనిని క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ కింద ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ ముందు బైండోవర్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా తాను ఎటువంటి నేరాలకు పాల్పడనని, శాంతియుతంగా ఉంటానని అతను బాండ్ రాసి ఇచ్చాడు. అయితే, బైండోవర్ పీరియడ్‌లో ఉండగానే రియాజుద్దీన్ తిరిగి కొత్త నేరానికి పాల్పడటాన్ని పోలీసులు గుర్తించారు. ఇది అతను గతంలో రాసి ఇచ్చిన బాండ్ నిబంధనలకు ప్రత్యక్ష ఉల్లంఘన కావడంతో, కామాటిపుర పోలీసులు తక్షణమే స్పందించారు. నిందితుడిని హైదరాబాద్ జిల్లా స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ కె. జ్యోతి ముందు ప్రవేశపెట్టి, బాండ్ రద్దు చేయాలని పోలీసులు కోరారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన మెజిస్ట్రేట్, నిందితుడు దోషిగా తేలడంతో అతనికి ఒక నెల (30 రోజులు) సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు రియాజుద్దీన్‌ను అదుపులోకి తీసుకుని, న్యాయపరమైన ఫార్మాలిటీస్ పూర్తి చేసిన అనంతరం శిక్ష అనుభవించే నిమిత్తం చంచల్‌గూడ కేంద్ర కారాగారానికి తరలించారు. "నగరంలో శాంతి భద్రతలకు భంగం కలిగించే వారు ఎంతటి వారైనా వదిలే ప్రసక్తి లేదు. బైండోవర్ నిబంధనలు అతిక్రమించే రౌడీషీటర్లు మరియు అసాంఘిక శక్తులపై కఠిన చర్యలు కొనసాగుతాయన్నారు ఎస్. శ్రీనివాస్, ఐపీఎస్, డీసీపీ రాజేంద్రనగర్ జోన్.

# కృషి హై స్కూల్ లో ఘనంగా 17వ వార్షికోత్సవం


**కృషి ఉంటే మనుషులు ఋషులవుతారు**




కుత్బుల్లాపూర్, మార్చి 14 (నవతరం): సురారం కాలనీ రామ్ లీల మైదానంలో కృషి హై స్కూల్ 15వ వార్షికోత్సవం కరస్పాండెంట్ శ్యామ్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అథితులుగా సుధీర్ సంద్ర, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి హాజరయ్యారు.కృషి హై స్కూల్ ,మరియు కృషి గ్రీన్ హిల్స్ బ్రాంచ్ పిల్లలు చిట్టి చిట్టి అడుగులతో డాన్స్ లు వేసి తల్లి తండ్రులను అలరించారు.నర్సరీ నుండి పదవతరగతి విద్యార్థులు చాలా చక్కగా భగవంతుని వేషధారణ లో డాన్స్ లు వేసి అందరిని ఆకట్టుకున్నారు. సుధీర్ సంద్ర మాట్లాడుతూ పిల్లలకు తల్లి తండ్రులు చదువు తో పాటు,ఆట పాటలతో డాన్స్ ప్రోగ్రాంలలో కూడా ముందుండాలని క్రమశిక్షణ తో పెంచాలని వారినీ సరైన పద్దతిలో చదివంచాలని అన్నారు.పాఠశాల కరస్పాండెంట్ శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ చాలా చిన్న పేదరికం మధ్య తరగతి కుటుంబం నుండి వచ్చాను అని దీనికి నిలువెత్తు నిదర్శనం తన తల్లి వనజ కుమారి అని వేరే పాఠశాలలో చదువు చెపుతూ అక్కడ వచ్చిన డబ్బులతో ఈ కృషి హై స్కూల్ లో చెప్పే ఉపాధ్యాయులకు సాలరీ లు ఇచ్చి నడిపామని అన్నారు. ఆ రోజు 200 మంది పిల్లలతో ఈ రోజు 1300 వందల మంది పిల్లలు చదువుతున్నారని సగర్వంగా చెప్పారు.మా కృషి లో చదివిన విద్యార్థులు స్టేట్ 1స్ సెకండ్ రావడం పాఠశాలకు గొప్ప వరం అని అదే విధంగా కృషి మూడో బ్రాంచ్ ఓపెన్ చేయడం చాలా సంతోషకరం అని అన్నారు .ఈ కార్యక్రమంలో ఇతర పాఠశాల ల కరస్పాండెంట్ లు,మరియు స్థానిక నాయకులు రవీందర్,రవి, శ్రీనివాస్,మరియు విద్యార్థుల తల్లి తండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఒకేసారి రెండు ప్రభుత్వ ఉద్యోగాలు


- **33 ఏళ్ల పాటు రెండు శాఖల నుండి జీతం...**
- **ఆ తర్వాత ఇలా బయటపడింది అసలు గుట్టు!**



ఉత్తర్ ప్రదేశ్, నవతరం: ఉత్తరప్రదేశ్లో నకిలీ పత్రాల సాయంతో ఒకే సమయంలో రెండు వేర్వేరు ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగం చేసిన ఉదంతం వెలుగులోకి వచ్చింది.సదరు వ్యక్తి సుమారు 33 ఏళ్ల పాటు రెండు చోట్ల నుండి జీతం మరియు ఇతర ప్రభుత్వ సౌకర్యాలను పొందుతూ వచ్చాడు.
సమాచార హక్కు చట్టం ద్వారా ఈ మోసం బయటపడింది.దీనిపై విచారణ జరిపిన కోర్టు,నిందితుడిని దోషిగా నిర్ధారిస్తూ ఏడేళ్ల జైలు శిక్ష విధించింది. దీనితో పాటు రూ.30 వేల జరిమానా కూడా విధించింది.
ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. 20 ఫిబ్రవరి 2009న బారాబంకికి చెందిన ప్రభాత్ సింగ్ అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు.సత్రీఖ్ ప్రాంతానికి చెందిన జయప్రకాష్ సింగ్ అనే వ్యక్తి నకిలీ పత్రాలను సృష్టించి, మోసపూరితంగా రెండు వేర్వేరు చోట్ల ప్రభుత్వ ఉద్యోగాలు సంపాదించాడని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.
సుదీర్ఘ కాలం పాటు రెండు శాఖల నుండి జీతం విచారణలో దిగ్భ్రాంతికరమైన విషయాలు వెలుగు చూశాయి. జయప్రకాష్ సింగ్ జూన్ 1993లో బారాబంకి జిల్లాలోని ప్రాథమిక విద్యా శాఖలో ఉపాధ్యాయుడిగా నియమితుడయ్యారు.
ఉపాధ్యాయుడు కాకముందే.. డిసెంబర్ 26,1979న ప్రతాప్‌గఢ్ జిల్లాలో 'నాన్ మెడికల్ అసిస్టెంట్'గా ఆయన బాధ్యతలు చేపట్టారు. ఆయన ఈ రెండు పదవుల్లోనూ ఒకేసారి కొనసాగుతూ, దశాబ్దాల పాటు రెండు శాఖల నుండి జీతభత్యాలు పొందినట్లు తేలింది.

ఏడేళ్ల శిక్ష మరియు రూ.30 వేల జరిమానా
పోలీసుల దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జ్ షీట్ దాఖలైంది.విచారణ సందర్భంగా ప్రాసిక్యూషన్ తగిన ఆధారాలను,సాక్షులను ప్రవేశపెట్టింది.
వాదోపవాదాలు విన్న తర్వాత, ప్రధాన జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ సుధా సింగ్ నిందితుడు జయప్రకాష్ సింగ్‌ను దోషిగా తేల్చారు. అతనికి ఏడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.30 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

# అభిమానం గెలిచింది..
# ఆత్మీయత నడిపించింది!



- అభిమాని మొక్కు కోసం వైస్ చైర్మన్ పాదయాత్ర - అశ్వారావుపేట రాజకీయాల్లో సరికొత్త అధ్యాయం
- అశ్వారావుపేటలో అరుదైన దృశ్యం
- పదవి ఉన్న పాదయాత్రతో భక్తిని చాటుకున్న జూపల్లి
- శ్రీశ్రీశ్రీ చిలకల గండి ముత్యాలమ్మ సన్నిధిలో వైస్ చైర్మన్ మొక్కుబడి
- ఆత్మీయుల సమక్షంలో కోలాహలంగా పాదయాత్ర
- విశ్వాసానికి పట్టాభిషేకం-కార్యకర్త కోరికను తన బాధ్యతగా నెరవేర్చిన వైనం

""రాజకీయాల్లో గెలిచిన తర్వాత చాలామంది మొక్కులు మరిచిపోతారు.కానీ జూపల్లి రమేష్ మాత్రం "నా గెలుపు నాది కాదు,, నన్ను నమ్మిన అభిమానిది"అని చాటిచెప్పారు.అభిమాని మొక్కును తానే స్వయంగా తీర్చి ఒక రియల్ హీరో అనిపించుకున్నారు. అశ్వారావుపేట మున్సిపాలిటీ చరిత్రలో ఇది ఒక సంచలన మరియు స్ఫూర్తిదాయక ఘటన.రాజకీయాలంటే కేవలం ఓట్లు, సీట్లు, పదవులే కాదు.. అంతకు మించిన ఆత్మీయ అనుబంధాలని నిరూపించారు
అశ్వారావుపేట మున్సిపాలిటీ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్.""

నవతరం ప్రతినిధి, ఖమ్మం భద్రాద్రి
సాధారణంగా నాయకులు గెలిచిన తర్వాత కృతజ్ఞతా సభలు పెడతారు, కానీ ఒక సామాన్య అభిమాని తన కోసం మొక్కుకున్న మొక్కును, ఆ నాయకుడే స్వయంగా కాలి నడకన వెళ్లి తీర్చడం ఉమ్మడి ఖమ్మం జిల్లా రాజకీయాల్లో ఒక సంచలనంగా మారింది.
ఆ మొక్కు వెనుక అపారమైన నమ్మకం
అశ్వారావుపేట మున్సిపాలిటీకి జరిగిన మొట్టమొదటి చారిత్రాత్మక ఎన్నికల సమయంలో, జూపల్లి రమేష్ మరియు జూపల్లి శశికళలు విజయం సాధించాలని వినాయకపురానికి చెందిన ఒక వీరాభిమాని శ్రీ శ్రీ చిలకల గండి ముత్యాలమ్మ తల్లి దేవస్థానంలో మొక్కుకున్నారు. "నా నాయకుడు గెలిస్తే అమ్మవారికి కాలినడకన వచ్చి మొక్కు తీర్చుకుంటాను" అన్నది ఆ అభిమాని సంకల్పం. ఎన్నికల ఫలితాల్లో జూపల్లి ద్వయం ఘనవిజయం సాధించి మున్సిపాలిటీ బాధ్యతలు చేపట్టారు.

**నేనే అడుగు వేస్తా.. నీ మొక్కు తీరుస్తా!**

అభిమాని మొక్కుకున్న విషయం తెలుసుకున్న జూపల్లి రమేష్, "నా కోసం మొక్కుకున్న నీ ప్రేమకు నేను ఇచ్చే గౌరవం ఇదే" అంటూ స్వయంగా పాదయాత్రకు సిద్ధమయ్యారు. అశ్వారావుపేట పట్టణం నుండి వినాయకపురం వరకు 15 కిలోమీటర్ల మేర సాగిన ఈ పాదయాత్రలో జూపల్లి రమేష్ భక్తిశ్రద్ధలతో నడిచారు. "రాజకీయాల్లో నాయకుడు అంటే పాలించేవాడు మాత్రమే కాదు, తనను నమ్మిన కార్యకర్త ఆశయానికి తోడుగా నిలిచేవాడని జూపల్లి రమేష్ నిరూపించారనీ స్థానిక విశ్లేషకులు మాట్లాడుకుంటున్నారు.

**కదం తొక్కిన కాంగ్రెస్ శ్రేణులు - భారీ జనసందోహం**

ఈ పాదయాత్ర కేవలం వ్యక్తిగత మొక్కుబడిగా కాకుండా, ఒక భారీ జన ప్రవాహంలా సాగింది. జూపల్లి రమేష్‌కు మద్దతుగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అడుగులో అడుగు వేశారు.
**ముఖ్య అతిథులు:** ప్రముఖ నాయకులు జూపల్లి ప్రమోద్, ఫణి, సుంకపల్లి వీరభద్రం,శంకర్ బాబు, మాజీ ఎంపీటీసీ రామకృష్ణ, ఊట్లపల్లి సర్పంచ్ సత్యం లక్ష్మీ కుమారి,సాధు జోషి, నక్క రాంబాబు, గుమ్మల్ల గోపి, తమ అనుచరులతో పాల్గొన్నారు.ఆత్మీయ సమక్షం: ఆత్మ కమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రం, వారి పుత్రుడు, మాజీ ఎంపీటీసీ రామకృష్ణ ఈ కార్యక్రమంలో పాల్గొని జూపల్లి రమేష్‌కు సంఘీభావం ప్రకటించారు.

**ఇది కేవలం భక్తి కాదు.. బలమైన బంధం!**

ఈ సంఘటన అశ్వారావుపేట మున్సిపాలిటీ రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీసింది.



**నైతికత:** సాధారణంగా మొక్కులు మొక్కుకున్న వారే తీర్చుకుంటారు. కానీ నాయకుడే తన అభిమాని తరపున కష్టపడటం ఆయనలోని నిరాడంబరతను చాటుతోంది.
క్యాడర్‌లో ఉత్సాహం: ఈ పాదయాత్రతో క్షేత్రస్థాయిలో ఉన్న కాంగ్రెస్ కార్యకర్తల్లో కొత్త ఉత్తేజం వచ్చింది. తమ నాయకుడు తమకు ఎంతటి విలువ ఇస్తారో ఈ ఘటనతో అర్థమైందని వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.
మున్సిపాలిటీలో ప్రశంసల జల్లు: కులమతాలకు అతీతంగా మున్సిపాలిటీ ప్రజలందరూ జూపల్లి రమేష్ తీసుకున్న ఈ నిర్ణయాన్ని అభినందిస్తున్నారు.

# తనకు నటన రాదని చెప్పాను




తండ్రి అంచనాలను తల్లకిందులు చేయడమే కాకుండా, తండ్రికి కావాల్సినంత పుత్రికోత్సాహాన్ని కూడా అందించింది మలయాళ మందారం కల్యాణి ప్రియదర్శన్. మలయాళ దిగ్దర్శకుడు ప్రియదర్శన్ గారాలపట్టి అయిన కల్యాణికి, అసలు యాక్ట్రస్ అవ్వాలనే ఆలోచనే లేదట. ఆర్కిటెక్ట్ కావాలనేది ఆమె డ్రీమ్ అట. అయితే.. అనుకోకుండా నటిగా మారింది. అంతేకాదు, తానే ప్రధాన పాత్రగా రూపొందిన లేడీ ఓరియెంటెడ్ థ్రిల్లర్ 'కొత్త లోక'తో బాక్సాఫీస్ వద్ద సన్సేషన్ క్రియేట్ చేసి, దాదాపు 300కోట్ల వసూళ్లను కొల్లగొట్టింది. దక్షిణాదిన ఓ లేడీ ఓరియెంటెడ్ సినిమాకు ఈ స్థాయిలో వసూళ్లు రావడం ఓ రికార్డ్. మరో ఆసక్తికరమైన విషయం ఏంటంటే.. కల్యాణి నటిగా మారింది తెలుగు సినిమాతోనే. అది ఎలా జరిగిందో ప్రియదర్శన్ చెబుతూ 'కల్యాణి సినిమాల్లో రాణిస్తుందని నేనస్సలు అనుకోలేదు. సెట్స్‌కి రావడానికి కూడా తను ఇష్టపడేది కాదు.

# హోంబలే సినిమాలు అవేనట




పానిండియా రెబల్‌స్టార్ ప్రభాస్‌తో ప్రతిష్టాత్మక చిత్రనిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్ మూడు సినిమాలు నిర్మించేందుకు ఒప్పందం కుదుర్చుకున్న విషయం తెలిసిందే. దీనికి సంబంధించి ప్రభాస్‌కు భారీ మొత్తంలో అడ్వాన్స్‌ను కూడా వారు అందించినట్టు ఓ వార్త కొన్నిరోజుల క్రితం మీడియాను షేక్ చేసింది. అయితే, ఆ మూడు సినిమాలు ఏంటి? దర్శకులెవరు? అనే విషయంలో మాత్రం క్లారిటీ లేదు. తాజా సమాచారం ప్రకారం ఈ వ్యవహారంపై క్లారిటీ వచ్చినట్టు తెలుస్తున్నది. ఈ మూడు సినిమాల్లో మొదటిది 'సలార్2: శౌర్యాంగపర్వం'. ప్రభాస్‌తో హోంబలే వారే 'సలార్' చిత్రాన్ని నిర్మించారు. ఆ సినిమా భారీ సక్సెస్ సాధించింది. ప్రభాస్‌తో వారు కుదుర్చుకున్న ఒప్పందంలో భాగంగా ముందు నిర్మించే సినిమా 'సలార్ 2' అని తెలిసింది. ఇక రెండో సినిమా.. మలయాళంలో కిష్కింధకాండ, ఏకో చిత్రాలను తెరకెక్కించిన దింజిత్ అయ్యథాన్ దర్శకత్వంలో ఉంటుందట. దీనికి సంబంధించిన కథను కూడా సదరు దర్శకుడు సిద్ధంచేశారట. అలాగే 'అమరన్'ఫేం రాజ్‌కుమార్ పెరియసామి కూడా ఇటీవలే ప్రభాస్‌కి ఓ కథ వినిపించారట. దాదాపు ప్రభాస్‌తో హోంబలే నిర్మించే మూడు సినిమాలు ఇవే అవుతాయని వినికిడి. అయితే ప్రభాస్ మాత్రం ప్రస్తుతం స్పిరిట్, ఫౌజీ, కల్కి 2 షూటింగ్స్‌లో బిజీగా ఉన్నారు. అవి పూర్తయితే తప్ప నెక్ట్స్ కమిట్‌మెంట్స్ గురించి ఆయన ఆలోచించలేరు.





## విరోష్ జంట పెళ్లిపై లావణ్య త్రిపాఠి ఆసక్తికర వ్యాఖ్యలు.

టాలీవుడ్ పాపులర్ జంట విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న పెళ్లిపై తాజాగా హీరోయిన్ లావణ్య త్రిపాఠి చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న లావణ్య త్రిపాఠి 'గీత గోవిందం' సినిమా గురించి మాట్లాడుతూ కొన్ని ఆసక్తికర విషయాలను వెల్లడించింది. లావణ్య త్రిపాఠి మాట్లాడుతూ.. గీత గోవిందం సినిమాకు మొదట నన్నే హీరోయిన్‌గా అడిగారు. అప్పట్లో కథ వినకముందే నేను ఆ ప్రాజెక్ట్‌కు నో చెప్పాను. తర్వాత కథ విన్నాక మాత్రం సినిమా చేయడానికి ఓకే చెప్పాను. కానీ అప్పటికే కొన్ని మిస్ అండర్ స్టాండింగ్స్ వల్ల ఆ సినిమా నా చేతుల నుంచి వెళ్లిపోయింది అని చెప్పింది. అదే సందర్భంలో ఆమె మరో ఆసక్తికర వ్యాఖ్య కూడా చేసింది. ఆ సినిమా వల్లే విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న కలిశారు.



## వేగం కంటే క్వాలిటీ ముఖ్యం

మంచి కంటెంట్ ఉన్న చిత్రాల్లో నటిస్తూ యువహీరోల్లో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపుని తెచ్చుకున్నారు ఆనంద్ దేవరకొండ. ముఖ్యంగా 'బేబీ' సినిమా ఆయన కెరీర్‌లోనే ఓ మైలురాయి అని చెప్పక తప్పదు. ప్రస్తుతం ఎపిక్, డ్యూయెట్ సినిమాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారాయన. ఆదివారం ఆనంద్ దేవరకొండ పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'వేగంగా సినిమాలు చేయడం కంటే క్వాలిటీగా సినిమాలు చేసేందుకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తాను. చేసే ప్రతి పాత్రకూ వేరియేషన్, ఎంచుకునే ప్రతి కథకూ స్ట్రాంగ్ కంటెంట్ ఉండేలా చూసుకుంటున్నాను. నటుడిగా ప్రేక్షకుల హృదయాల్లో ఓ మంచి స్థానాన్ని సంపాదించుకోవడమే నా లక్ష్యం' అన్నారు ఆనంద్ దేవరకొండ. సితార ఎంటర్‌టైన్మెంట్స్‌లో తాను చేస్తున్న 'ఎపిక్' సినిమా ఒక విభిన్నమైన ప్రేమకథ అని, కేవలం ప్రమోషనల్ కంటెంట్‌తోనే ఈ సినిమా ఆడియన్స్‌లో బజ్‌ని క్రియేట్ చేయడం చాలా ఆనందంగా ఉందని, దర్శకుడు ఆదిత్యహాసన్ ఈ సినిమాను అద్భుతంగా తెరకెక్కించారని ఆనంద్ తెలిపారు. అలాగే మిథున్ వరదరాజ కృష్ణన్ దర్శకత్వంలో తాను చేస్తున్న 'డ్యూయెట్' సినిమా కూడా చాలా కొత్తగా ఉంటుందని ఆనంద్ పేర్కొన్నారు.

# ఈ సారి వచ్చేది ఉస్తాద్ ఉగాది

'ఎవరి సినిమా అయినా బాగా ఆడాలనే కోరుకుంటాన్నేను. ఓ ప్రజాప్రతినిధిగా టికెట్ రేట్లు విషయంలోనూ నేను వివక్ష చూపలేదు. నన్నడిగితే.. టికెట్ రేట్లు పెంచమని ప్రభుత్వాలను ప్రత్యేకంగా అడగాల్సిన అవసరం లేదు. పెంచకపోతే బ్లాక్ మార్కెట్ పెరుగుతుంది. అందుకే.. టికెట్ రేట్ల విషయంలో ఎవరు పెంచమని అడిగినా మేం కాదనలేదు. చివరకు కన్నడ సినిమా 'కాంతారా2'కు కూడా టికెట్లు పెంచుకునే అవకాశం ఇచ్చాం. సినిమా బావుండాలి. అందరూ చూడాలి. అందులో మన సినిమాలు కూడా ఉండాలని కోరుకుంటాన్నేను' అన్నారు అగ్రహీరో పవన్‌కల్యాణ్. ఆయన కథానాయకుడిగా రూపొందిన ప్రస్టేజియస్ యాక్షన్ డ్రామా 'ఉస్తాద్ భగత్‌సింగ్'. శ్రీలీల, రాశీఖన్నా కథానాయికలు. హరీశ్‌శంకర్ దర్శకత్వంలో మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ యర్నేని, యలమంచిలి రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ నెల 19న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్రీరిలీజ్ ఈవెంట్‌లో పవన్‌కల్యాణ్ మాట్లాడారు. ఇంకా చెబుతూ 'ఈ సినిమా బాగా రావడానికి కారణం హరీశ్‌శంకర్.

నా కాలం తాలూకు విలువను అర్థం చేసుకొని నన్ను ముందుకు నడిపించాడు తను. 45రోజుల్లో సినిమా పూర్తి చేశాడు. సినిమాలు చేయాలా వద్దా అనే మీమాంసలో ఉన్న నాకు, ఈ ప్లానింగ్‌తో ముందుకెళ్తే సినిమాలు చేయొచ్చని నమ్మకాన్నీ, ధైర్యాన్నీ ఇచ్చాడు. తను తెలంగాణ బిడ్డ. కరీంనగర్ నుంచి వచ్చిన వ్యక్తి. అద్భుతమైన పాండిత్యం గల గొప్ప దర్శకుడు. ఈ



సినిమాకోసం తను పడ్డ తపన సామాన్యమైనది కాదు. ఈ సినిమాని అందరూ మెచ్చేలా తను తీర్చిదిద్దారు.

Owned and Published by Sirigiri Varadaraju, RNI No: APTEL/2018/76747, Dr. Narsimlu Yellampally - Bureau Chief, Telangana, 9618907705, email: navataramtelugudaily@gmail.com, Telangana State Corporate Office: Plot No. A/9, Phase -1, Alwyn Colony, Kukatpally, Hyderabad - 72, Telangana, India. website: https://navatharam.com